
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 234 | మంగళవారం 8 ఏప్రిల్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-



# బీజేపీ బాస్‌గా డీకే అరుణ?

**బీజేపీ జాతీయ నాయకత్వం డీకే అరుణ పేరును చాలా సీరియస్**

**డీకే అరుణ రాష్ట్ర అధ్యక్ష రేసులో ముందున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.**

**డీకే అరుణ పేరును తెరపైకి తీసుకుని రావడం ద్వారా ఒక మహిళా నేతకు రాష్ట్ర బాధ్యతలు అప్పగించినట్టు ఉంటుందని జాతీయ నాయకత్వం వద్ద చర్చ ఉందట**

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్**

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష రేసులో ఇప్పటి వరకు చాలా పేర్లు వినిపించాయి. అందులో ప్రధానంగా ఈటల రాజేందర్, బండి సంజయ్, ధర్మపురి అరవింద్, రాం చరందర్ రావు, మురలీధర్ రావు, రఘునంధన్ రావు పేర్లు ఉన్నాయి. కొంతకాలంగా మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ పేరు కూడా వినిపిస్తుంది. అయితే బీజేపీ జాతీయ నాయకత్వం డీకే అరుణ పేరును చాలా సీరియస్ గా పరిశీలిస్తుందంట.దేశాన్ని యూనిట్ గా తీసుకుంటే వాటిలో కొన్ని రాష్ట్రాలకు మహిళా అధ్యక్షురాళ్లను సైతం పెట్టాలన్నది బీజేపీ జాతీయ నాయకత్వం ఆలోచనలో ఉందట. దానికి రాష్ట్రంలో ఉన్న ఈక్వేషన్స్ కూడా తోడు కావడంతో డీకే అరుణ రాష్ట్ర అధ్యక్ష రేసులో ముందున్నట్టు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. తెలంగాణ బీజేపీలో రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న నేతలతో పాటు పార్టీ శ్రేణులు కూడా వివిధ గ్రూపులుగా విడిపోయారంట. తమకే అధ్యక్ష పదవి ఇవ్వాలని నాయకులు అంటుండగా.. తమ నాయకుడు అయితేనే పార్టీని సమర్దవంతంగా నడపగలడని పార్టీ శ్రేణులు వాదించుకుంటున్నారంట . డీకే అరుణ పేరును తెరపైకి తీసుకుని రావడం ద్వారా ఒక మహిళా నేతకు రాష్ట్ర బాధ్యతలు అప్పగించినట్టు ఉంటుందని జాతీయ నాయకత్వం వద్ద చర్చ ఉందట.దీనికి తోడు డీకే అరుణకు ఇప్పటికే బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా అధిష్టానం దృష్టిలో మంచి మార్కులు కొట్టేయడంతో ఆమె పేరు బలంగా వినిపిస్తుందంట. డీకే అరుణకు రాష్ట్ర బాధ్యతలు అప్పగిస్తే మిగతా నేతలు ఎవరూ వ్యతిరేకించరన్న చర్చ సైతం రాష్ట్ర కార్యాలయంలో సాగుతోందంట. డీకే అరుణకు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అంశంలో పార్టీ అంతర్గత అంశాలతో పాటు రాష్ట్ర రాజకీయాలు కూడా ఆమెకు కలిసి వస్తున్నాయట. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా కావడం, అక్కడ నుంచి కాంగ్రెస్ కు చెక్ పెట్టి మహబూబ్ నగర్ పార్లమెంట్ నుంచి ఎంపీగా గెలవడం డీకే అరుణకు కలిసి వస్తుందట. కాంగ్రెస్ హోల్డ్ లో - మిగతా3లో

# పీ4 అమలుకు 'రాష్ట్ర స్థాయి సొసైటీ'



- సొసైటీకి చైర్‌పర్సన్‌గా సీఎం, వైస్ చైర్‌పర్సన్‌గా డిప్యూటీ సీఎం
- ఆగస్టు నాటికి 5 లక్షల బంగారు కుటుంబాల దత్తతే లక్ష్యం
- సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

పేదరిక నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన 'జీరోపావర్టీ–పీ4' కార్యక్రమాన్ని విస్తత పరిచేలా పటిష్ట వ్యవస్థను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఇందుకు సంబంధించి 'స్టేట్ లెవెల్ సొసైటీ'ని ఏర్పాటు చేస్తోంది. దీనికి ముఖ్యమంత్రి చైర్‌పర్సన్‌గా, డిప్యూటీ సీఎం వైస్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. అలాగే సీఈవో, డైరెక్టర్... వారికి అనుసంధానంగా కాల్ సెంటర్, టెక్ టీమ్, ప్రోగ్రాం టీమ్, వింగ్ టీమ్ ఉంటాయి. జిల్లా చాప్టర్‌కు జిల్లా మంత్రి చైర్‌పర్సన్‌గా, నియోజకవర్గ చాప్టర్‌కు ఎమ్మెల్యే చైర్‌పర్సన్‌గా, గ్రామ, వార్డు స్థాయిలో సెక్రటేరియట్ చాప్టర్లకు చైర్‌పర్సన్‌గా పంచాయతీ కార్యదర్శి, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు ఉంటారు. రాష్ట్ర స్థాయి సొసైటీ ఏర్పాటు, పీ4 పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రతి జిల్లా కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యేలు మార్గదర్శిలను గుర్తించి బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలని చెప్పారు. దాతలు ఎవరెవరు ఎంత మొత్తం ఇచ్చారు... ఇంకెంత సాయం - మిగతా3లో



## అకీరా బర్త్‌డే రోజే.. నా చిన్న కుమారుడికి ఇలా జరగడం బాధాకరం

- మీ ఆశీస్సులతో మార్క్ శంకర్ కోలుకుంటున్నాడు..
- సమ్మర్‌క్యాంప్‌లో అగ్నిప్రమాదం జరిగి నా కుమారుడి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి.
- తన కుమారుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఎంతో మంది మంచి మనస్సుతో ఆశీస్సులు అందించడంతో మార్క్ క్రమంగా కోలుకుంటున్నాడు
- సింగపూర్‌లో అవసరమైన సహకారం అందించాల్సిందిగా అక్కడి హైకమిషనర్‌కు దిశానిర్దేశం చేశారు

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్**

సింగపూర్‌లోని పాఠశాలలో జరిగిన అగ్ని ప్రమాదంలో తన చిన్న కుమారుడు మార్క్ శంకర్‌కు గాయాలైన ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. స్కూల్ పిల్లలు సమ్మర్ క్యాంప్‌నకు వెళ్లగా.. అక్కడ జరిగిన అగ్ని ప్రమాదంలో తన కుమారుడికి గాయాలైనట్లు తెలిపారు. "అరకు పర్యటనలో ఉండగా మార్క్‌శంకర్‌కు గాయాలైనట్లు ఉదయం 8.30గంటలకు ఫోన్ వచ్చింది. సమ్మర్‌క్యాంప్‌లో అగ్నిప్రమాదం జరిగి నా కుమారుడి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఊపిరితిత్తుల్లోకి పొగ చేరింది. తన పక్కనే కూర్చున్న చిన్నారి మృతిచెందడం బాధించింది. సుమారు 30మంది చిన్నారులు సమ్మర్‌క్యాంప్‌లో - మిగతా3లో

## పోలవరం - బనకచర్ల ప్రాజెక్టు కోసం 'జలహారతి' కార్పొరేషన్ ఏర్పాటు

- పోలవరం ప్రాజెక్టు నుంచి వరద జలాలను తరలించేలా పోలవరం – బనకచర్ల లింకు ప్రాజెక్టును రూపొందించనున్నారు.
- 80 లక్షల మందికి తాగునీటిని అందించేలా ఈ లింక్ ప్రాజెక్టును తీర్చిదిద్దుతున్నారు.
- కొత్తగా 3 లక్షల హెక్టార్ల ఆయకట్టు సాగులోకి వస్తుందని ప్రభుత్వం



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టు చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం 'జలహారతి' కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. కంపెనీల చట్టం కింద 100 శాతం ప్రత్యేక వాహక సంస్థ(ఎస్‌పీవీ)గా ఈ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్పొరేషన్‌కు సీఎం చంద్రబాబు ఛైర్మన్‌గా, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వైస్ ఛైర్మన్‌గా, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీఈవోగా - మిగతా3లో

## చంద్రబాబు మెప్పు కోసం పని చేసే పోలీసులను వదలం

- ఏపీలో ఒకప్పటి పూర్వపు బీహార్ పరిస్థితులు
- స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో కూటమి దౌర్జన్యం
- పాపిరెడ్డిపల్లిలో టీడీపీ నేతల చేతిలో హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబానికి పరామర్శ



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి పాపిరెడ్డిపల్లి**

రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఇక్కడి పరిస్థితులు పూర్వపు బీహార్‌ను తలపిస్తున్నాయని వైయస్ఆర్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైయస్ జగన్ మండిపడ్డారు. స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో కూటమి దౌర్జన్యానికి అంతు లేకుండా పోయిందని, ఎక్కడా ఏ మాత్రం బలం లేకున్నా గెల్చేందుకు ప్రయత్నించారని, ఆ దిశలోనే అన్ని చోట్లా యథేచ్ఛగా దాడుల పర్వం కొనసాగించిందని ధ్వజమెత్తారు. శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం, రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో టీడీపీ గూండాల చేతిలో ఇటీవల దారుణ హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్నివైయస్ జగన్ పరామర్శించారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడారు. రాప్తాడులో జరిగిన ఘటనకు సంబంధించి ఈ ఇంటికి వచ్చి - మిగతా3లో

# చంద్రబాబు మెప్పు కోసం పని చేసే పోలీసులను వదలం



-మొదటిపేజీ తరువాయి

ఈ నియోజకవర్గంలో ఎందుకు ఈ ఘటన జరిగింది? ఎందుకు రాష్ట్రంలో ఈ పరిస్థితి నెలకొంది అన్నది ప్రతి ఒక్కరూ వాళ్ల గుండెలపై చేతులు వేసుకొని ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. ఇక్కడే లింగమయ్య భార్య ఉంది. తన భర్తను కోల్పోయిన బాధలో ఉంది. గత నెలలో రాష్ట్రంలో 57 చోట్ల ఉప ఎన్నికలు జరగాల్సి ఉండగా, 7చోట్ల చంద్రబాబుకు సానుకూల పరిస్థితి లేదు. మిగిలిన వాటిలో ఏకంగా 39 చోట్ల వైయస్సార్‌సీపీ గెలిచింది. వాటిలో చంద్రబాబుకు బలం లేదు. గెల్చిన వారంతా వైయస్సార్‌సీపీ సభ్యులే. ఫ్యాన్ గుర్తు గెల్చిన చోట చంద్రబాబుకు బలం లేదని తెలిసీ కూడా హింసను ప్రోత్సహిస్తూ, పోలీసులను తన వద్ద ఉన్న వాచ్‌మెన్ల కంటే హీనంగా వాడుకుంటున్నాడు.

రామగిరిలో ఏమి జరిగిందటే..

ఇదే రామగిరి మండలంలో ఎంపీపీ ఎన్నికకు సంబంధించి 10 మందికి గాను 9 మంది వైయస్‌ఆర్‌సీపీ ఎంపీటీసీలు గెలిచారు. ఇక్కడ ఎంపీపీ స్థానానికి నోటిఫికేషన్ వస్తే ఏ పార్టీకి ఎంపీపీ పదవి వస్తుంది? అయినా కూడా ఎందుకు ఇక్కడ చంద్రబాబు స్థానిక ప్రజాప్రతినిధులను రెచ్చగొట్టి చివరకు వైయస్సార్‌సీపీ సభ్యులను ప్రలోభపెట్టారు? వీళ్లంతా కోర్టుకు వెళ్లి తమకు ప్రాణ హాని ఉందని నోటీసులు తెచ్చుకున్నారు?. కోర్టు ఆదేశాలతో 8 మంది ఎంపీటీసీలను తీసుకువస్తుంటే మధ్యలో పోలీసుల రక్షణలో ఓటు వేయాల్సి ఉండగా, రామగిరి ఎస్ఐ సుధాకర్ వీళ్ల కాన్వాయ్‌లోకి వచ్చి ఆయన ఫోన్ నుంచి ఎమ్మెల్యేతో వీడియో కాల్ చేయించి మాట్లాడించారు. భారతమ్మ అనే ఎంపీటీసీ సభ్యురాలి అమ్మానాన్నను వీడియోకాల్‌లో చూపించి బెదిరించారు. ఆమె కన్నీరుమున్నీరుగా ఏడ్చింది. ఒక ఎస్ఐ చేసే పనేనా ఇది?. ప్రలోభాలకు లొంగకపోవడంతో, ఇక ఎన్నిక జరగకుండా కోరం లేదంటూ వాయిదా వేయించారు. ఇదే ఎస్ఐ ఎంపీటీసీలను టక్క నియోజకవర్గం పెనుకొండకు తీసుకెళ్లి బైండోవర్ చేశారు. అక్కడికి మా నాయకులు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, ఉషాశ్రీ చరణ్ వెళ్తే వీరిద్దరిపై కేసులు నమోదు చేశారు. అసలు వాళ్లు చేసిన తప్పేంటి? మా పార్టీకి చెందిన ఎంపీటీసీలను కిడ్నాప్ చేస్తుంటే అడ్డుకోవడం తప్పా? అందుకు వారిపై కేసులు పెడతారా?.

లింగమయ్య దారుణహత్య:

ఇన్ని చేసినా టీడీపీ గెలువదు కాబట్టి మండలంలో భయాందోళనకు గురి చేసేందుకు గత నెల 27, 28 తేదీల్లో జయచంద్రారెడ్డి ఇంటిపై దాడి చేశారు. కురుబ లింగమయ్య ఆ దాడిని అడ్డుకున్నారు. ఎంపీటీసీలను భయాందోళనకు గురి చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. 28వ తేదీ లింగమయ్య కొడుకుతో కలిసి బైక్‌పై వెళ్తుంటే దాడి చేశారు. కర్రలు, రాళ్లు, మచ్చు కత్తి తీసుకెళ్లి లింగమయ్యపై దాడి చేశారు. ఆ దాడిలో లింగమయ్య తల పగిలిపోయింది. ఈ సందర్భంగా ఏకంగా బేస్‌బాల్ బ్యాట్ విరిగిందంటే, ఏ స్థాయిలో హింసించారనేది అర్థం చేసుకోవచ్చు. ఇవన్నీ చేయకపోవడం న్యాయమా? ధర్మమేనా?:

అయ్యా చంద్రబాబు మీరు చేస్తున్నది న్యాయమేనా? ధర్మమేనా? ఈరోజు రాష్ట్రం బీహార్ కంటే దారుణంగా తయారవుతోంది. సిగ్గు లేకుండా అరాచకాలు చేస్తున్నారు. లింగమయ్య హత్య కేసులో పోలీసులు కేవలం ఇద్దరిపై మాత్రమే కేసు పెట్టారు. ఈ కేసులో క్రియాశీలంగా వ్యవహరించిన రమేష్‌నాయుడిపై ఎందుకు కేసు పెట్టలేదు? వారంతా ఎమ్మెల్యే బంధువులు కాబట్టి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రెచ్చగొట్టిన వ్యక్తులను ఎందుకు కేసుల నుంచి తప్పించారు? ఈ హత్యను ప్రోత్సహించిన ఎమ్మెల్యే, ఆమె కుమారుడిపై ఎందుకు కేసు పెట్టలేదు?.

ఫిర్యాదు చేసినా కూడా పోలీసులు ఎందుకు పట్టించుకోలేదు? ఎస్ఐ సుధాకర్ వీడియో కాల్స్‌తో ప్రతి ఎంపీటీసీని ప్రలోభపెట్టారు. ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? ఆయన ఫోన్ రికార్డులు ఎందుకు పరిగణలోకి తీసుకోలేదు. లింగమయ్య కొడుకుపై కూడా దాడి చేశారు. లింగమయ్య కొడుకు ఫిర్యాదు తీసుకోకుండా, లింగమయ్య భార్యకు చదువు రాదని ఆమెతో వేలిముద్రలు తీసుకున్నారు. పోలీసులు రాసుకున్న పేపర్‌పై భయపెట్టి వేలిముద్రలు బలవంతంగా వేయించుకున్నారు. కొడుకు స్టేట్‌మెంట్ తీసుకోలేదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు మాజీ శాసనసభ్యులు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాజీ మంత్రులు ఉష శ్రీచరణ్ శంకర్ నారాయణ ఎంపీ మిథున్ రెడ్డి వేంపల్లి సతీష్ రెడ్డి అనంత వెంకటరామిరెడ్డి శ్రీధర్ రెడ్డి మక్బూల్ ఆలూరు సాంబశివరెడ్డి తలసిల రఘురాం తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి దీపిక వెంకటరామిరెడ్డి గోరంట్ల మాధవ్ తలారి రంగయ్యపెద్ద ఎత్తున వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## అకీరా బర్త్‌డే రోజే..

## నా చిన్న కుమారుడికి ఇలా జరగడం బాధాకరం



-మొదటిపేజీ తరువాయి

ఉన్నప్పుడు ఈ ఘటన జరిగింది. అగ్నిప్రమాదం చిన్నదే అనుకున్నా.. తర్వాత దాని తీవ్రత తెలిసింది. నా పెద్ద కుమారుడు అకీరా పుట్టిన రోజే.. రెండో కుమారుడికి ఇలా జరగడం బాధాకరం. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉందంటున్నారు. పొగపీల్చడం వల్ల దీర్ఘకాలంలో ఆరోగ్యంపై ప్రభావం ఉండొచ్చని చెబుతున్నారు. మా అబ్బాయి వయసు ఏడేళ్లు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడే భవనం నిర్మిస్తున్న కార్మికులు స్పందించి కాపాడారు. ఈ ఘటన గురించి తెలిసి నా భార్య షాక్‌లో ఉన్నారు. రాత్రి 9.30గంటలకు సింగపూర్ బయల్దేరుతా" అన్నారు.

మీ ఆశీస్సులతో మార్క్ శంకర్ కోలుకుంటున్నాడు..

తన చిన్నకుమారుడు మార్క్ శంకర్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడని పవన్ తెలిపారు. తన కుమారుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఎంతో మంది మంచి మనస్సుతో ఆశీస్సులు అందించడంతో మార్క్ క్రమంగా కోలుకుంటున్నాడని తెలిపారు. ప్రతిఒక్కరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం రాత్రి ఓ ప్రకటన కూడా విడుదల చేశారు. "ఈ ప్రమాద విషయం తెలుసుకొని ప్రధాని మోదీ ఫోన్ చేసి మార్క్ ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేసి ధైర్యం చెప్పారు. సింగపూర్‌లో అవసరమైన సహకారం అందించాల్సిందిగా అక్కడి హైకమిషనర్‌కు దిశానిర్దేశం చేశారు. ఆయనకు నా హృదయ పూర్వకకృతజ్ఞతలు. సీఎం చంద్రబాబు ఫోన్ చేసి మాట్లాడారు. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ మాజీ సీఎం జగన్, తమిళనాడు మాజీ సీఎం పళనిస్వామి, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఏపీ ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు, ఏపీ మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, దుర్గేష్, భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె లక్ష్మణ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీపీఐ నేత రామకృష్ణ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సహచర సినీనటులు, సినీరంగ ప్రముఖులు సామాజిక మాధ్యమాల ద్వారా, వివిధ మాధ్యమాల ద్వారా మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించిన నేతలు, కార్యకర్తలు.. ప్రతిఒక్కరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నా" అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## పీ4 అమలుకు 'రాష్ట్ర స్థాయి సొసైటీ'

-మొదటిపేజీ తరువాయి

'బంగారు కుటుంబాలు'కు అవసరం అవుతుంది వంటి విషయాలు అన్నీ వెబ్‌సైట్‌లో పొందుపరచడంతో పారదర్శకంగా ఉంటుందని, పీ4పై విశ్వాసం మరింత పెరుగుతుందని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఆగస్ట్ 15 కల్లా 5 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మార్గదర్శి, బంగారు కుటుంబాల నమోదు చేపడుతున్నట్టు సమీక్షలో అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇందుకోసం మిలాప్, డొనేట్‌కార్ట్, రంగ్‌దే సంస్థలు ప్లేయర్లుగా పీ4లో భాగస్వాములు అవుతున్నాయని తెలిపారు. దాతలు కుటుంబాలను, మండలాలను, గ్రామాలను కూడా దత్తత తీసుకోవడంతో పాటు, నిధులు సమకూర్చేలా పీ4 రూపకల్పన చేశామన్నారు. దాతలు తాము ఎవరికి ఆర్థికంగా సాయం చేయాలి అనుకుంటున్నారో... ఆన్ లైన్ ద్వారా కూడా వారికి సాయం అందించే అవకాశాన్ని కల్పించామన్నారు. దాతలు ముందుగా పీ4 ప్లాట్ ఫామ్ ద్వారా లాగిన్ అవ్వడంతో ప్రక్రియ ప్రారంభమవుందని చెప్పారు. ఆగస్ట్ నాటికి ఈ నమోదు ప్రక్రియ పూర్తి చేసి కార్యరూపం దాల్చేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను నిర్దేశించారు. వచ్చే ఉగాది నాటికల్లా పీ4 కార్యక్రమం ద్వారా ఏడాది కాలంలో ఏం సాధించామనే దానిపై వార్షిక ప్రగతి నివేదిక విడుదల చేయాలని స్పష్టం చేశారు.

## పోలవరం - బనకచర్ల ప్రాజెక్టు కోసం 'జలహారతి' కార్పొరేషన్ ఏర్పాటు

-మొదటిపేజీ తరువాయి

వ్యవహరించనున్నారు. పోలవరం ప్రాజెక్టు నుంచి వరద జలాలను తరలించేలా పోలవరం - బనకచర్ల లింకు ప్రాజెక్టును రూపొందించనున్నారు. 80 లక్షల మందికి తాగునీటిని అందించేలా ఈ లింక్ ప్రాజెక్టును తీర్చిదిద్దుతున్నారు. కొత్తగా 3 లక్షల హెక్టార్ల ఆయకట్టు సాగులోకి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 9.14 లక్షల హెక్టార్లకు నీటిని ఇవ్వటంతో పాటు 20 టీఎంసీల మేర పరిశ్రమలకు ఇవ్వొచ్చని ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు రూ.80,112 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. గోదావరి బేసిన్‌లో వృథాగా పోతున్న వరద జలాలను లోటు ఉన్న ప్రాంతాలకు తరలించేలా లింకు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. పల్నాడు జిల్లా బొల్లాపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి బనకచర్ల రెగ్యులేటర్ వరకూ నీటిని తరలించేలా ప్రణాళిక రూపొందించనున్నారు. దాదాపు 150 టీఎంసీల వరకూ నీటిని తరలించేందుకు ఆస్కారం ఉందని.. లోటు ఉన్న జిల్లాలకు ఈ వరద జలాలను వినియోగించుకోవచ్చని యోచిస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉండే రాయలసీమ జిల్లాలకు నీటిని అందించేలా ఈ ప్రాజెక్టు ఉపకరిస్తుందని ప్రభుత్వం చెబుతోంది. పోలవరం - బనకచర్ల రెగ్యులేటర్‌కు కాలువలు, ఎత్తిపోతల పథకాలు, భూగర్భ పైప్ లైన్లు, సొరంగాల ద్వారా నల్లమల నుంచి నీటిని తరలించాల్సి ఉంటుందని పేర్కొంది. దీని కోసం ఓ ప్రత్యేక వాహక సంస్థగా జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టుగా దీన్ని తీర్చిదిద్దాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఎస్పీవీగా బహిరంగ మార్కెట్ల నుంచి నిధులు సేకరించేందుకు అవకాశం ఉందని వెల్లడించింది.

# ఆక్వా రైతులకు గట్టి ఎదురుదెబ్బ

**ఏలూరు :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న కీలక నిర్ణయం వల్ల ఆంధ్రప్రదేశ్ ఆక్వా రైతులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా దిగుమతులపై సుంకాలను 3% నుండి 26% వరకు పెంచడంతో, ఏపీ నుంచి ఎగుమతి అయ్యే వనామీ రొయ్యల ధర ఒక్కసారిగా పడిపోయింది. దీని ప్రభావంతో రూ. లక్ష విలువైన రొయ్యలు ఇప్పుడు లక్షా 26 వేలు ఖర్చవుతుండగా, రవాణా, ప్యాకింగ్ తో కలిపి మొత్తం ఖర్చు 50% పెరిగిపోయింది.ఇక ఎగుమతి దారులు ధరలు కేజీకి రూ. 30 నుంచి 50 వరకు తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో 100 కౌంట్ రొయ్య ధర రూ. 250 ఉండగా, ఇప్పుడు అది రూ. 210కి పడిపోయింది. ఈ నెల 9వ తేదీ నుంచి అమెరికా సుంకం అమల్లోకి రానుంది. ఏటా ఏపీ నుంచి 17.2 లక్షల టన్నుల వనామీ రొయ్యలు అమెరికాకు ఎగుమతి అవుతుండగా, ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే రోజుకు 2 వేల టన్నులు వెళు _న్నాయి.రైతుల ఆందోళనల నేపథ్యంలో, సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు. రొయ్యలపై సుంకాల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. మత్స్యరంగం ఏపీ జీడీపీలో 11% వాటాతో కీలకంగా ఉందని, ఈ సంక్షోభ సమయంలో రైతులకు అండగా ఉండాలని ఆయన లేఖలో వివరించారు. అధిక సుంకాల వల్ల విదేశీ ఆర్డర్లు రద్దవుతుండటంతో పాటు, గిడ్డంగుల్లో నిల్వ స్థలాలు కూడా లేవని ఆయన వెల్లడించారు.ఇక కేంద్రం ఆక్వా రైతులకు మేలు చేసే విధంగా చర్యలు తీసుకుంటుందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ భరోసా ఇచ్చారు. అయితే, రైతులు ఇబ్బందుల్లో ఉన్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసీపీ నేతలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వ్యాపారవర్గాలే ధరలు కుదించే సిండికేట్‌గా మారారని ఆరోపిస్తూ, రైతులకు అండగా పోరాడతామని స్పష్టం చేశారు.

ప్రభుత్వమే దోచుకుంటుంది...

ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వారంగం తీవ్ర సంక్షోభంలో ఉన్నా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఎందుకు పట్టించుకోవడం లేదని మాజీ సీఎం జగన్ ప్రశ్నించారు. 100 కౌంట్ రొయ్యల ధర అకస్మాత్తుగా రూ.280 నుంచి దాదాపు రూ.200- రూ.210కి పడిపోయిందని చెప్పారు.చంద్రబాబు నాయుడు ఆక్వారంగం తీవ్ర సంక్షోభంలో ఉంటే నిద్రపోతున్నారా? అమెరికా టారిఫ్‌ల దెబ్బ ఒకటైతే, ఆపేరు చెప్పి మీ పార్టీకి చెందిన వ్యాపారులంతా సిండికేట్ అయి రైతులను దోచుకుతింటుంటే ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు? రోజు రోజుకూ ధరలు పతనం అవుతున్నా ప్రభుత్వం ఎందుకు జోక్యం చేసుకోవడం లేదు?ప్రభుత్వ స్థాయిలో ఒక రివ్యూ చేసి, గట్టి చర్యలు ఎందుకు తీసుకోవడంలేదు? రైతులంతా గగ్గోలు పెడితే, మీడియా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలదీస్తే కేంద్రానికి ఒక లేఖ రాసి చేతులు దులుపుకోవడం ఎంతవరకు సమంజసం? ఇక ప్రభుత్వం ఉండీ ఏం లాభం? 100 కౌంట్ రొయ్యల ధర అకస్మాత్తుగా రూ.280 నుంచి దాదాపు రూ.200- 210కి పడిపోయింది. ఈ ధరలు ఇంకా తగ్గుతున్నా, క్రాప్ హాలిడే తప్ప వేరే మార్గం లేదని రైతులు కన్నీళ్లు పెడుతున్నా ఈ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు?కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు ధాన్యం, పత్తి, పొగాకు, మిర్చి, కంది, పెసలు, మినుము, అరటి, టమోటా ఇలా ప్రతి పంటకూ గిట్టుబాటు ధర లేకుండా పోయింది. దళారులు రైతుల కష్టాన్ని దోచుకుతింటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సమస్యలను ప్రస్తావిస్తే మీ ప్రభుత్వం ఎదురుదాడి చేసి తప్పించుకుంటోంది తప్ప ఎక్కడా బాధ్యత తీసుకోవడంలేదు. ఇప్పుడు ఆక్వా విషయంలోనూ అంతే.ఎగుమతుల్లోనూ, అలాగే విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించడంలోనూ రాష్ట్ర ఆక్వారంగం దేశంలోనే నంబర్ వన్. అలాంటి రంగాన్ని మరింతగా ఆదుకోవడానికి ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీని మా హయాంలో ఏర్పాటు చేశాం. ఆక్వా సీడ్, ఫీడ్ ధరలను నియంత్రించడంతోపాటు నాణ్యత పాటించేలా ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చాం. సిండికేట్‌గా మారి దోపిడీచేసే విధానాలకు చెక్ పెడుతూ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా రొయ్యలకు ధరలు నిర్ణయించాం.కొవిడ్ సమయంలో దాదాపు ఐదేళ్ల క్రితం 100 కౌంట్‌కు, ఆ రోజుల్లో కనీస ధరగా రూ.210లు నిర్ణయించి రైతులకు బాసటగా నిలిచాం. మూడుసార్లు ఫీడ్ ధరలు తగ్గించాం. ఇప్పుడు ఫిష్ ఆయిల్, సోయాబీన్ సహా ముడిసరుకుల దిగుమతులపై సుంకం దాదాపు 15% నుంచి 5% తగ్గినా ఈ కూటమి ప్రభుత్వంలో ఫీడ్ ధరలు ఒక్కపైసా కూడా తగ్గలేదు. మేం ఏర్పాటు చేసిన నియంత్రణ బోర్డు అందుబాటులో ఉన్నాసరే రేట్లు తగ్గడంలేదు.గతంలో చంద్రబాబు హయాంలో ఆక్వాజోన్ పరిధిలో కేవలం 80-90వేల ఎకరాలు ఉంటే, మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ జోన్ పరిధిలోకి 4.22 లక్షల ఎకరాలు తీసుకువచ్చాం. ఆక్వా రంగంలో మొత్తం 64వేల విద్యుత్ కనెక్షన్లు ఉంటే అందులో జోన్ పరిధిలో ఉన్న 54వేల కనెక్షన్లకు రూ.1.50కే యూనిట్ కరెంటు అందించాం. దీనికోసం రూ.3,640 కోట్లు సబ్సిడీ కింద ఖర్చుచేశాం. ఆక్వాజోన్స్‌లో ఉన్న ఆర్బీకేల్లో ఫిషరీస్ గ్రాడ్యుయేట్లను ఆక్వా అసిస్టెంట్లుగా నియమించి రైతుకు చేదోడుగా నిలిచి, ఎప్పుడు సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కారం చూపించాం. ఇప్పుడు ఆర్బీకే వ్యవస్థను నాశనం చేసి, అత్యధికంగా ఆర్జిస్తున్న రంగాన్ని దెబ్బతీస్తున్నారు.చంద్రబాబు.. ఇప్పటికైనా కళ్లు తెరవండి. వెంటనే రొయ్యలకు ధరలు ప్రకటించి, ధరల పతనాన్ని అడ్డుకోండి. అమెరికా టారిఫ్‌ల పేరుతో రైతుల్ని దోచుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోండి. ఈ టారిఫ్‌లు అన్నవి కేవలం మన దేశానికి మాత్రమే పరిమితమైనవి కావు, ఇక ముందుకూడా ఇవి కొనసాగుతాయి. ఊరికే ఒక లేఖ రాసి చేతులు దులుపుకోవడం కాదు" అని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

# వైసీపీలో రెడ్డి - నాన్ రెడ్డి వార్

**విజయవాడ :** జగన్ ఎక్కడ మాట్లాడినా అతను నోట్లోంచి వచ్చే మాట నా ఎస్సీలు? నా బీసీలు. ఈ నా ఎస్సీలు నా బీసీలు డైలాగే మొన్నటి ఎన్నికల్లో జగన్ కొంపముంచింది. వైసీపీలో పేరుకి ఎస్సీలు, బీసీలు నామస్మరణ చేస్తారే తప్ప?. నడిపించేదంతా రెడ్లే. ఎవరు అవునన్నా కాదన్నా వైసీపీ రెడ్ల పార్టీయే. ఈ మాట బయట జనం మాట్లాడుకునేదే కాదు పార్టీలో కూడా అందరూ ఇదే మాట్లాడుకుంటూ ఉంటారు. ఇప్పుడు వైసీపీలో రెడ్డి నాన్ రెడ్డి వార్ రోజు రోజుకి ముదురుతోంది. పార్టీలో రెడ్లకు ప్రాధాన్యం తగ్గించకపోతే భవిష్యత్తు కష్టమవుతుందని ఓపెన్ గానే మిగిలిన కులాల వాళ్లు మాట్లాడేసుకుంటున్నారు.2019?.24 మధ్య జగన్ పాలన అంతా రెడ్డి రాజ్యమే నడిచింది. ఓటమి తర్వాత పార్టీలో మిగిలిన కులాలు ఓపెన్ గానే రెడ్డి వ్యతిరేక స్వరం వినిపిస్తున్నాయి.ఏపీ రాజకీయాలను రెండు అగ్రకులాలు శాసిస్తున్నాఅనేది జగమెరిగిన సత్యం. వైసీపీ అంటే రెడ్ల పార్టీ. టిడిపి అంటే కమ్మ వాళ్ల పార్టీ. దీనిలో మరో వాదనే లేదు. 2009లో పి అర్ పి?..2014లో జనసేన వచ్చినప్పుడు మాత్రమే కాపులకు కూడా ఒక పార్టీ ఉంది అని జనం మాట్లాడుకున్నారూ. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాపులు పవన్ కళ్యాణ్ కోసం పూర్తిగా జనసేనతో నిలబడ్డారు. పవన్ కళ్యాణ్ కోసమే మూకుముడిగా టిడిపికి కూడా ఓటు వేశారు. మనం ఎన్ని కబుర్లు చెప్పుకున్న ఏపీ రాజకీయాల్ని కమ్మ, రెడ్డి కులాలే ఈరోజుకి శాసిస్తున్నాయి. తెలుగుదేశం వ్యవహార శైలి వైసీపీకి భిన్నంగా ఉంటుంది. టిడిపి అధినాయకత్వం ఎప్పటికీ కమ్మ కులం చేతిలోనే ఉంటుంది. టిడిపి అధ్యక్షుడిగా ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ,చంద్రబాబు కుటుంబీకులే అవుతారు. అంతేకాక కమ్మ సామాజిక వర్గం ఒక ఓజోన్ లేయర్ లాగా టిడిపిని కాపాడుకుంటూ వస్తుంది. అయితే ఈ భావన ఎక్కడా కనిపించకుండా టిడిపి మొదటినుంచి బీసీలకు, ఇతర కులాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లుగా కలరింగ్ చూపిస్తుంది. అందుకే బీసీ కులస్తుడైన అచ్చం నాయుడిని రాష్ట్ర అధ్యక్షుడిగా తెర పై పెడతారు. బీసీలకు ఎస్సీలకు పార్టీలో, ప్రభుత్వంలో ప్రాధాన్యం ఇస్తున్నట్లే చూపిస్తారు. అంతేకాదు వాళ్ళకి సముచిత గౌరవం కూడా ఉంటుంది. అందువల్ల టిడిపిలో కుల పరమైన అసంతృప్తి సాధ్యమైనంత వరకు రాదు.వైసీపీ విషయానికొస్తే అలా ఉండదు. అది 100% రెడ్ల పార్టీ. ఎవరు ఎలా అనుకున్నా కూడా రెడ్ల కి అన్ని స్థాయిల్లోనూ ప్రాధాన్యం ఇస్తారు.పైకి మాత్రం జగన్మోహన్ రెడ్డి నా ఎస్సీలు, నా బీసీలు అని గట్టిగా అరుస్తుంటాడు. ఆ పార్టీలో ఎస్సీలు, బీసీలు నిర్ణయాత్మక శక్తి కానే కాదు. జగన్ సీఎం గా ఉన్నప్పుడు ఐదుగురు డమ్మీ డిప్యూటీ సీఎం లను పెట్టాడు. ఎస్సీలు ,బీసీలు, ఎస్సీలకు ప్రాధాన్యమిస్తూ డిప్యూటీ సీఎం పదవులు వాళ్ల కేటాయించాడు. కానీ వాళ్లు పూర్తిగా డమ్మీలనే విషయంబయట అందరికీ తెలుసు. అసలు రాజ్యాంగంలోనే లేని డిప్యూటీ సీఎం ఏ కులం వాడికి ఇచ్చినా ఒకటే. ఆ పోస్టుకి ప్రత్యేకంగా పవర్స్ ఉండవు. అది అందరిలాంటి మంత్రి పదమే.ఇక వైసీపీలో రెడ్ల ఆధిపత్యం ఎలా ఉంటుంది అనడానికి ఆ పార్టీలో రీజనల్ ఇన్చార్జిల నియామకమే ఒక ఉదాహరణ. పార్టీకి జగన్ మోహన్ రెడ్డి సెంటర్ పోల్ అయితే నాలుగు స్తంభాలాగా విజయ సాయి రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యవహరించేవారు. ఉత్తరాంధ్రాకి ఇన్చార్జిగా జగన్?. విజయ్ సాయి రెడ్డిని నియమించాడు. అలాగే రాయలసీమకి ఇంచార్జిగా సజ్జల ఉండేవాడు. కోస్తా జిల్లాలకు మిథున్ రెడ్డి ఇన్చార్జిగా ఉండేవాడు. అసలు విజయసాయిరెడ్డి అనే వ్యక్తికి ఉత్తరాంధ్రకి సంబంధం ఏమిటో ఎవరికి తెలియదు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నన్నాళ్ళు విజయ్ సాయి రెడ్డి ఉత్తరాంధ్ర జిల్లాలకు ముఖ్యమంత్రి లా వ్యవహరించాడు.ప్రతి వ్యాపారంలో, రియల్ ఎస్టేట్లో ఆయన వేలు పెట్టాడు. ఉత్తరాంధ్రని అల్లకల్లోలం చేసి వదిలిపెట్టాడు. అక్కడ వైసీపీ దారుణ ఓటమికి విజయ్ సాయి రెడ్డి ప్రధాన కారణం. ఇక మిథున్ రెడ్డికి కోస్తా జిల్లాలకి ఏ సంబంధము ఎవరికీ అర్థం కాదు. సాయిరెడ్డి అంతా అల్లకల్లోలం చేయకపోయినా మిథున్ రెడ్డికి కోస్తా జిల్లాల పాలిటిక్స్ అసలు అర్థం కాలేదు. కోస్తా జిల్లాల్లో మిథున్ పూర్తిగా వైఫల్యం చెందాడు. ఇక సజ్జల రాయలసీమ వ్యవహారాలను పట్టించుకున్నదే లేదు. ఆయన నెంబర్ 2 లా వ్యవహరించి మొత్తం పార్టీని ముంచాడు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో మిగిలిన రెడ్లు అంతా సామంత రాజుల్లా వ్యవహరించారు. చివరికి ఓటమి తర్వాత కూడా మళ్లీ సాయిరెడ్డి నేను తీసుకెళ్లి ఉత్తరాంధ్రకి ఇంచార్జిగా పెట్టాడు జగన్. ఆ ప్రాంతం నాశనం అయిన?.. తన పార్టీ నాశనం అయిన కూడా సాయిరెడ్డి పై మమకారం పోలేదు జగన్ రెడ్డికి. సాయి రెడ్డి నిష్క్రమణ తర్వాత జ్ఞానోదయం అయ్యింది.చివరికి కాపు కులస్తుడైన కురసాల కన్నబాబుని ఇప్పుడు ఉత్తరాంధ్రకి ఇంచార్జిగా పెట్టారు. ఇది కేవలం ఉత్తరాంధ్రకి సంబంధించిన వ్యవహారమే కాదు పార్టీలో ఇప్పటికీ రెడ్ల హవాయే నడుస్తుందని మిగిలిన కులాల నాయకులు

# నువ్వు నవ్వుతున్నావో.. ఏడుస్తున్నావో అర్థం కావడం లేదు

మేము అనుకుని ఉంటే ఇక్కడ అడుగు కూడా పెట్టలేవ్
జగన్ పర్యటనపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం
నన్ను, నా కుమారున్ని టార్గెట్ చేయడానికే జగన్ వచ్చాడు
రామగిరిలో కాదు.. పులివెందులలోని బాత్ రూముల్లోనే ఆయుధాలుంటాయి
పోలీసులపై జగన్ వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం
జిల్లా ఎస్పీతో పాటు పోలీసులు ఇప్పటికైనా స్పందించాలి

**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 8:** రాప్తాడు నియోజకవర్గంలో మా కుటుంబం చేస్తున్న అభివృద్ధిని సంక్షేమాన్ని చూడలేక కేవలం నన్ను నా కుమారుని టార్గెట్ చేయడానికి మీరు వచ్చారని రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీత ఆరోపించారు. చావు ఇంటికి పరామర్శకు వచ్చి... వెకిలి నవ్వులు నవ్వుతూ... ఒక బీసీ కుటుంబాన్ని పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డి, ఆయన పార్టీ నేతలు అవమానించారని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి రామగిరి మండలం పాపిరెడ్డి పల్లి పర్యటనపై ఆమె తీవ్రంగా స్పందించారు. వెంకటాపురంలోని తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ... ఒక అసమర్థుడు.. చేతకాని దద్దమ్మ ప్రకాష్ రెడ్డి మాటలు విని జగన్ రెడ్డి ఇక్కడికి వచ్చి పచ్చి అబద్దాలు చెప్పి వెళ్లారని విమర్శలు చేశారు. అసలు గ్రామంలో ఏం జరిగింది ఎలా జరిగిందన్నది తెలుసుకోకుండా.. ప్రకాష్ రెడ్డి రాసిచ్చిన స్క్రిప్ట్ చదివేందుకు బెంగళూరు నుంచి జగన్ వచ్చాడని ఆమె ధ్వజమెత్తారు. ఇక్కడ కర్రలతో దాడి జరిగితే.. కొడవండ్లు, రాళ్లు, రాడ్లు అంటూ జగన్ పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. అలాంటి ఆయుధాలు పులివెందులలోని బాత్ రూముల్లో చంపడానికి ఉపయోగిస్తారు కానీ.. రామగిరిలో అలాంటివి ఉండవన్నారు. పాపిరెడ్డిపల్లిలో జరిగిన ఘటన విషయంలో అందరికన్నా ఎక్కువ బాధ కలిగింది మాకేనని.. అయితే ఇప్పటివరకు ఆ కుటుంబాన్ని వైసిపి నాయకులు ఎవరూ పరామర్శించలేదన్నారు. ప్రకాష్ రెడ్డి వెళ్లడానికి చేతకాక జగన్ రెడ్డిని పిలిపించాడని విమర్శలు చేశారు. తాము అనుకొని ఉంటే జగన్ రెడ్డి ఇక్కడ అడుగు కూడా పెట్టలేడని పరిటాల సునీత అన్నారు. ఇక్కడ జగన్ రెడ్డి నాతో పాటు నా కుమారున్ని టార్గెట్ చేయడానికే వచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి కూడా ఆయన మాట్లాడిన మాటల మీద తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు గురించి, మా గురించి మాట్లాడే స్థాయి జగన్ కు లేదన్నారు. మీ సొంత చిన్నాన్నను చంపితే... న్యాయం చేయాలని మీ చెల్లెలు వేడుకున్నా.. నువ్వు పట్టించుకోలేదన్నారు. ఇంట్లో తల్లికి చెల్లెళ్లకు న్యాయం చేయలేని నువ్వు లింగమయ్య కుటుంబానికి ఏం న్యాయం చేస్తావని ప్రశ్నించారు. గతంలో తన భర్త పరిటాల రవీంద్ర పై కేసులు పెట్టించి ఆయన పులివెందులకు వెళితే వాహనాలు తనిఖీ చేయించి అడ్డుకున్నారని గుర్తు చేశారు. మీ తండ్రి అలాంటి పనులు చేసినా మేము ఎక్కడా నిన్ను అడ్డుకునే ప్రయత్నం చేయలేదని సునీత అన్నారు. అయినప్పటికీ నన్ను నా కొడుకును టార్గెట్ చేశారని ధ్వజమెత్తారు. అసలు నువ్వు పాపిరెడ్డిపల్లికి ఒక బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చావా లేక మీ కార్యకర్తల చేత జేజేలు కొట్టించుకునేందుకు వచ్చావా అంటూ నిలదీశారు. మొత్తం జిల్లాలో ఉన్న మాజీ ఎమ్మెల్యేలందర్నీ పిలిపించి.. సెల్ఫీలు, షోలు చేసుకున్నారని విమర్శలు చేశారు. చావు ఇంటికి వెళ్లి దుఃఖంలో ఉన్న ఆ కుటుంబాన్ని ఎలా పరామర్శించాలో కూడా జగన్ రెడ్డికి తెలియడం లేదన్నారు. ఆయన చుట్టూ ఉన్న మాజీ ఎమ్మెల్యేలు ఆ కుటుంబాన్ని చూసి నవ్వుతూ మాట్లాడుకుంటున్నారని విమర్శలు చేశారు. అసలు జగన్ నవ్వుతున్నాడో ఏడుస్తున్నాడో కూడా తెలియని పరిస్థితి అక్కడ కనిపించిందన్నారు. లింగమయ్య కుటుంబానికి మీరు ఏం న్యాయం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామాలకు వచ్చి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని... గతంలో హెచ్చరించినా జగన్ అదే పని చేసి వెళ్లాడని సునీత అన్నారు. ఎంపీపీ ఎన్నిక గురించి మాట్లాడుతున్న జగన్... మీకు అంత బలం ఉన్నా అక్కడ ఎందుకు గెలవలేదో ఒకసారి ఆలోచించుకోవాలన్నారు. ఒక చేతకాని మాజీ ఎమ్మెల్యే ఉన్నాడు అని పరిటాల సునీత అన్నారు



**జిల్లా ఎస్పీతో పాటు పోలీసులంతా జగన్ వ్యాఖ్యలపై స్పందించాలి**

జగన్ రెడ్డి పాపిరెడ్డిపల్లి పర్యటనలో పోలీసులు ఎక్కడ అడ్డుకోకపోయినా... ఆయనకేదో జనం ఎక్కువగా వచ్చినట్టు... వారిని అడ్డుకున్నట్టు ప్రచారం చేసుకున్నారని పరిటాల సునీత ధ్వజమెత్తారు. వాస్తవంగా ఇక్కడ పోలీసులు రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలికారన్నారు. గతంలో తాము కనీసం వినతి పత్రాలు ఇవ్వాలన్న అడ్డుకున్న సందర్భాలను గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో ఎక్కడా అలాంటి పరిస్థితి లేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో మమ్మల్ని పోలీసుల ద్వారా ఎన్ని ఇబ్బందులు పెట్టారో అంతా చూశారన్నారు. కానీ ఏ రోజు తాము పోలీసుల మీద దురుసుగా వ్యవహరించలేదన్నారు. ఒక మాజీ ముఖ్యమంత్రి అయి ఉండి పోలీసులను గుడ్డలు ఊడదీస్తానంటూ వ్యాఖ్యలు చేస్తున్నారంటే ఆయన దిగజారుడుతనం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. పైగా రామగిరి ఎంపీపీ ఎన్నిక సందర్భంగా.... పెనుకొండలో ప్రకాష్ రెడ్డి పోలీసులను పచ్చి బూతులు తిడితే... పోలీసులంతా స్పందించాలని పరిటాల సునీత సూచించారు.....

# పోలీస్ పిల్లలకు అండగా ఉంటాం

- పోలీసు సిబ్బంది ఆర్థిక అవసరాలకు ఆసరాగా కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ
- విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,

**అంకుశం న్యూస్ విజయనగరం ఏప్రిల్ 8:** విజయనగరం జిల్లాలో పోలీస్ పిల్లలకు పోలీస్ సిబ్బందికి అన్ని విధాలుగా అండగా ఉంటామని విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. విజయనగరం జిల్లా పోలీసు ఉద్యోగుల కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సర్వ సభ్య సమావేశం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏప్రిల్ 8న నిర్వహించగా, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా వారి ఆర్థిక అవసరాలను తీర్చుకొనేందుకుగాను జిల్లా పోలీసు ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేయబడిందన్నారు. తక్కువ వడ్డీతో కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా రుణాలను పొందే పోలీసు ఉద్యోగులు తమ పిల్లల చదువులు, వివాహాలు, గృహ నిర్మాణాలు, ఇంటి రిపేర్లు, అత్యవసర వైద్య ఖర్చులు మరియు ఇతర ఆర్థిక అవసరాలను తీర్చుకోగలుగుతున్నారన్నారు. ఈ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా 2024 - 25 సంవత్సరంకు వచ్చిన ఆదాయ, వ్యయాలను, పోలీసు సంక్షేమానికి తీసుకున్న చర్యలను సొసైటీ సభ్యులకు జిల్లా ఎస్పీ వివరించారు. పోలీసు ఉద్యోగులు తీసుకున్న సభ్యత్వం, సర్వీసు ఆధారంగా ఇప్పటికే రూ.3లక్షల నుండి రూ.5 లక్షలను వ్యక్తిగత రుణాలుగా అందజేస్తున్నామన్నారు పోలీసు ఉద్యోగుల పిల్లలతో జిల్లా ఎస్పీ మమేకమై, మంచి లక్ష్యాలను నిర్దేశించుకొని, జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా, 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో వారు సాధించిన మార్కులు, ప్రస్తుతం వారు ఎక్కడ చదువుతున్నది వంటి విషయాలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకొని, వారికి తగిన సూచనలు, సలహాలను ఇచ్చి, విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు.







ఈ సర్వసభ్య సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, ఎస్బీ సిఐ ఆర్.వి.ఆర్.కె చౌదరి, ఆర్ఐ ఎన్.గోపాలనాయుడు, ఇతర పోలీసు అధికారులు, కో-ఆపరేటివ్ సెక్రటరీ ఎం. నీలకంఠం నాయుడు, డైరెక్టర్లు ఎస్.రామకృష్ణ, పి.ఈశ్వరరావు, ఎం.విజయ చందర్, వై.చిన్నారావు మరియు కో-ఆపరేటివ్ సభ్యులు, పోలీసు అసోసియేషను అడహక్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు పోలీసు కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన - రాష్ట్ర వైద్య,వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్.



**అంకుశం న్యూస్ ధర్మవరం ఏప్రిల్ 08:** ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో నేడు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ గారు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ కింద అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 20 మంది లబ్ధిదారులకు రూ. 18,81,558/- విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ, పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే ప్రభుత్వం యొక్క ప్రధాన లక్ష్యం. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంలో ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సకాలంలో వైద్యం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది, అని పేర్కొన్నారు. ఆరోగ్యానికి సంబంధించి అత్యవసర అవసరాల సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు చేస్తుందనీ, ఈరోజు ఒక్క ధర్మవరం నియోజకవర్గంలోనే దాదాపు 19 లక్షల రూపాయల మేర సహాయం అందించగలిగినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. ధర్మవరం నియోజకవర్గ ప్రజల తరఫున ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఆకట్టుకున్న ధార్మిక, సంగీత కార్యక్రమాలు



**అంకుశం న్యూస్ కడప ఏప్రిల్ 8:** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు మంగళవారం టిటిడి ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన ధార్మిక, సంగీత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 10 నుండి 11 గంటల వరకు శ్రీ వెంకటరమణ "తార, మండోదరి మాటలు" అనే అంశంపై మాట్లాడుతూ, తార, మండోదరి ఇద్దరూ రామాయణంలో ముఖ్యమైన పాత్రలని తెలిపారు. తార వాలి భార్య, మండోదరి రావణుని భార్య, ఇద్దరూ తమ భర్తలకు సలహా ఇస్తూ, వారిని మంచి మార్గంలో నడిపించే ప్రయత్నం చేశారన్నారు. వాలిని యుద్ధానికి వెళ్ళే ముందు, సుగ్రీవుడితో శాంతింపమని, దౌత్యపరమైన చర్యలతో శాంతియుతంగా జీవించమని, ఉన్నతమైన రాముడితో స్నేహం చేయమని కోరిందన్నారు. వాలి ఆమె హెచ్చరికను తోసిపుచ్చడంతో యుద్ధంలో మరణించినట్లు వివరించారు. అదేవిధంగా మండోదరి రావణుడిని మంచి మార్గంలో నడిపించేందుకు ప్రయత్నించింది, కానీ విఫలమైందన్నారు. అనంతరం మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు శ్రీ శ్రీనివాస్, శ్రీ సుగుణాకర్, శ్రీ పవన్ కుమార్ బృందం " తులసీ జలంధర" పై హరికథ గానం భక్తిభావాన్ని పంచాయి.



సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు హైదరాబాద్‌కు చెందిన లావణ్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన నేత్రపర్వంగా జరిగింది.

## దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సాహిద్దాం

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి
దివ్యంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి





**అంకుశం ప్రతినిధికొత్త చెరువు: ఏప్రిల్08:** విభిన్న ప్రతిబావంతుల్లో ఉన్న ప్రతిభను వెలుగులోకి తీసుకొద్దామని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. సత్యసాయిజిల్లా విద్యా శాఖ సమగ్ర శిక్ష సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కొత్త చెరువు మండల కేంద్రంలోని సత్యసాయి బాబా భజన మందిరంలో దివ్యంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం లో భాగంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కల్సి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ,మంత్రి నారా లోకేష్ సహాయ సహకారాలతో విభిన్న ప్రతిభావంతులకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పేదలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు నడుస్తున్నాయని గుర్తు చేశారు. అలాగే విభిన్న ప్రతిభావంతులకు ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారికి రావాల్సిన పాత బకాయిలు సుమారు రూ.54 లక్షల 24 వేలు మంజూరు చేసినట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు ఆయన విద్యార్థుల్లో మంచి నైపుణ్యం ఉందని అలాంటివారు వివిధ రంగాల్లో రాణిస్తారని వారికి ప్రోత్సాహం ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. దివ్యాంగ పిల్లలు కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని వారిలో ప్రతిభకు కొదవలేదని పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు తల్లిదండ్రులకు చేయూతను అందిస్తున్న సర్వ శిక్ష అభియాన్ అధికారులకు వారి ఉపాధ్యాయ బృందానికి కూటమి ప్రభుత్వానికి ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలిపారు.మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విభిన్న ప్రతిభావంతులకు చేయూతనందిస్తూ అన్ని విధాలుగా అండగా నిలిచిన కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరికి విద్య ఎంతో అవసరం అన్నారు. మన తలరాతను మార్చేది విద్య తోనే సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని వివిధ రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. మాజీ సర్పంచ్ మాణిక్యం బాబా తదితరులు పాల్గొన్నారు.

## మొదటి రోడ్డు శివాలయం పునర్నిర్మాణంకి నా వంతు సహకరిస్తా



అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధికారులకు హామీ

**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 8:** అనంతపురం నగరంలోని మొదటి రోడ్డు శ్రీ కాశీ విశ్వేశ్వర, కోదండ రామాలయం పునర్నిర్మాణంకి తన వంతు సహకారం అందిస్తానని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఆలయ ఇన్ ఛార్జి ఈఓ శోభ ఎమ్మెల్యేతో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆలయ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ప్రస్తుతం పునర్నిర్మాణం కోసం దేవాదాయ శాఖ డిప్యూటీ ఇంజనీర్ రూ.4.50కోట్లతో అంచనాలు సిద్ధం చేశారని ఎమ్మెల్యే దృష్టికి ఈఓ తీసుకెళ్లారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన అన్ని అంశాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ పనులకు సంబంధించి దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి.. నిధులను త్వరగా మంజూరు చేయించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన అంశాన్ని దేవాదాయశాఖ మంత్రి దృష్టికి కెళ్లి.. నిధులు వచ్చే చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ భక్తమండలి సభ్యులు దాడి శ్రీనివాసులు చౌదరి, నరేంద్ర చౌదరి, జి.జే. వేణు, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాది రమణారెడ్డికి పరశురామ పురస్కారం

10వ తేదీన శబరిమలలో ప్రదానం చేయనున్న ఎస్ ఎస్ ఎస్ డివోటీస్ గ్రూపు



**అంకుశం న్యూస్ విజయవాడ ఏప్రిల్ 8:** విజయవాడ రూరల్ మండలం నున్నకు చెందిన సీనియర్ న్యాయవాది, అయ్యప్ప గురు స్వామి డాక్టర్ డీవీ రమణరెడ్డికి ప్రతిష్టాత్మకమైన పరశురామ పురస్కారం లభించింది. దశాబ్ధాలుగా అయ్యప్పస్వామికి నిస్వార్థసేలందిస్తున్నందుకు కేరళలోని అయ్యప్ప సేవా భక్తుల ఆధ్వర్యంలో ఏర్పాటైన ఎస్ ఎస్ ఎస్ డివోషనల్ గ్రూపు ఈ ఏడాది డాక్టర్ రమణారెడ్డికి పరశురామ పురస్కారాన్ని ప్రకటించింది. శబరిమలలోని పంబ గణపతి ఆలయం సమీపంలోని ఆంజనేయ ఆడిటోరియంలో ఈ నెల 10వ తేదీన ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డును స్వీకరించేందుకు ఈ నెల 10వ తేదీన శబరిమలకు రావాల్సిందగా ఎస్ ఎస్ ఎస్ డివోషనల్ గ్రూపు ఫౌండర్ శివ నరసింహన్ రమణారెడ్డికి ఈ మేరకు ఆహ్వానం పంపించారు. న్యాయవాది డాక్టర్ రమణారెడ్డి ట్రావెన్‌కోర్ దేవోస్వామ్ బోర్డుకు కూడా తన సేవలనందించారు. ఇదిలావుండగా, నున్నకు చెందిన డాక్టర్ రమణారెడ్డికి ప్రతిష్టాత్మకమైన పరశురామ పురస్కారం లభించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అమరావతిలో కేంద్ర విదేశాంగశాఖ ప్రాంతీయకార్యాలయం ఏర్పాటు కానుంది

ఎంపి కేశినేని శివనాథ్

ఆధునీకరించిన పాస్ పోర్ట్ సేవా కేంద్రం, నూతన ప్రాంతీయ పాస్ పోర్ట్ కేంద్రాలు ప్రారంభం

ఈ కేంద్రాలను ప్రారంభించిన కేంద్ర మంత్రి కీర్తి వర్ధన్ సింగ్

కేంద్ర మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ను సన్మానించిన ఎంపి కేశినేని శివనాథ్






**అంకుశం ప్రతినిధి విజయవాడ ఏప్రిల్ 8:** వికసిత్ భారత్ 2047లో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పాస్ట్ పోర్ట్ కార్యాయాలన్నీ ఆధునీకరణతో కార్పొరేట్ ఆఫీసులుగా తయారు అవుతున్నాయి. ప్రధాన మంత్రి మోదీ సహకారంతో ఎపి కూడా అభివృద్ధి వైపు పయనిస్తుంది. రాబోయే కాలంలో అమరావతిలో కేంద్ర విదేశాంగశాఖ ప్రాంతీయకార్యాలయం ఏర్పాటు కానుందని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. విజయవాడ లో పాస్ పోర్ట్ సేవా కేంద్రం, రీజనల్ పాస్ పోర్ట్ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు ఎమ్మెల్యేలు బొండా ఉమా మహేశ్వరరావు , గద్దె రామ్మోహన్ రావు , వై.సుజనా చౌదరి, జాయింట్ సెక్రటరీ(పి.సి.పి), అండ్ సిపివో డాక్టర్ కె.జె.శ్రీనివాస్, రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ కె.శివహర్ష పాల్గొన్నారు. ఈ కార్యాలయాలను ప్రారంభించేందుకు పాస్ పోర్ట్ సేవా కేంద్రానికి విచ్చేసిన కేంద్ర విదేశీ వ్యవహారాల,పర్యావరణం, అటవీ, వాతావరణ శాఖ సహాయ మంత్రి మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలకటంతో పాటు శాలువాతో సత్కరించి కొండపల్లి బొమ్మను బహుకరించారు. అనంతరం ఆధునీకరించిన పాస్ పోర్ట్ సేవా కేంద్రాన్ని కేంద్ర మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తో కలిసి ప్రారంభి, శిలాఫలకం ఆవిష్కరించారు. ఆ తర్వాత స్టాలిన్ సెంట్రల్ మాల్ లోని నాలుగవ అంతస్తులో రీజనల్ పాస్ పోర్ట్ కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ లో ప్రాంతీయ పాస్ పోర్ట్ కార్యాలయం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. వైజాగ్ లో పాస్ పోర్ట్ సేవా కేంద్రం వుండటంతో పాస్ పోర్ట్ జారీ కావటంలో ఆలస్యం జరిగేదని, ఇకపై ఆలస్యం వుండదని వారం పదిరోజుల్లో పాస్ పోర్ట్ జారీ అవుతుందన్నారు. వైజాగ్ తో పాటు విజయవాడ లో కూడా పాస్ పోర్ట్ సేవా కేంద్రం అందుబాటులోకి రావటం ఈ ప్రాంతం ప్రజలకు చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. పాస్ పోర్ట్ కోసం ప్రతి రోజు 600 నుంచి 2000 మంది దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం 3లక్షల పాస్ పోర్టులు ఈ కార్యాలయం నుంచే మంజూరు అవుతున్నాయన్నారు.

# ఉరవకొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం





- : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రతి మండలంలో కూడా ఏర్పాటు చేస్తాం
- : అర్జీలన్నీ నమోదు చేసుకొని ఒక బాధ్యతతో వాటిని పరిష్కరిస్తాం
- : రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్
- : విడపనకల్లు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్..

**అంకుశం ప్రతినిధిఅనంతపురం, ఏప్రిల్ 08 :**
– అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారులిప్రజల సమస్యలను పరిష్కారం చేసే దిశలోనే మండల కేంద్రంలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, అర్జీలన్నీ ఒక బాధ్యతతో పరిష్కరిస్తామని రాష్ట్ర ఆర్థిక %ు% ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మంగళవారం ఉరవకొండ నియోజకవర్గంలోని విడపనకల్లు మండల కేంద్రంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ అర్జీలను స్వీకరించారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో మంత్రి మొక్కను నాటారు. అనంతరం అక్కడే రూఫ్ టాఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులకు మంత్రి భూమి పూజ చేశారు. తదనంతరం ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడి వారిని మంత్రి పేరుపేరునా పలకరించారు.
– ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సుదీర్ఘకాలం ఉండడంతో సమావేశాల్లో ఎక్కువ కాలం గడపడం, అనేక సమస్యలపై ఫోన్లు రావడం జరిగిందని, ఇలాంటివన్నీ చూసిన తర్వాత ఒక కార్యక్రమం రూపొందించాలనుకున్నామన్నారు. 30 ఏళ్లుగా మీలో ఒకడిగా భావించి నన్ను ఈ స్థాయి తీసుకొచ్చిన ఉరవకొండ నియోజకవర్గం ప్రజల రుణం తీర్చుకునే బాధ్యత తనపై ఉందన్నారు. రాష్ట్రంలో తనకున్న బాధ్యతలను ఒకవైపు నిర్వర్తిస్తూనే, నియోజకవర్గ బాధ్యతలను కూడా పూర్తిస్థాయిలో చేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. రాష్ట్రానికి మంత్రినైనా జిల్లాకు, ఉరవకొండ నియోజకవర్గంకు మొదటి కూలీగానే పనిచేస్తానన్నారు. తన ఆలోచనలు, దృక్పథంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. మీలో ఒకడిగా మీ కష్టాలను, కన్నీళ్లను, బాధలను చూసి సమస్యలను పరిష్కారం చేసే దిశలోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో అప్పులను వారసత్వంగా ఇచ్చారని, ఆస్తులు లేకుండా అప్పులు ఇచ్చిపోతే ఆ కుటుంబాన్ని నెట్టుకు రావడం ఎంత భయంకరంగా ఉంటుందో ఈరోజు రాష్ట్రంలో కూడా ఆర్థిక పరిస్థితి అంతే అస్తవ్యస్తంగా ఉందన్నారు. పూర్తి అప్పులమయం అయిపోయిందని, శుక్రవారం రోజు బ్యాంకుల నుంచి అప్పు కట్టాలని తనకు ఫోన్లు వస్తాయన్నారు. వీటన్నిటిని నడుమ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు అన్నింటినీ సమతూకం చేసుకుంటూ ముందుకెళ్తున్నామన్నారు. మన ఆదాయం ఎంత, మన ఖర్చు ఎంత అనేది మామూలుగా చెప్పాలంటే రాష్ట్ర మొత్తం వచ్చే ఆదాయం, కేంద్ర ప్రభుత్వం నుంచి మనకు వచ్చే ఆదాయం మొత్తం తీసుకుంటే మనం ప్రభుత్వాన్ని నడపడానికి, జీతభత్యాలకు, పాత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలు కట్టేందుకు సరిగ్గా సరిపోతుందని, ఒక్క రూపాయి మిగలడం లేదన్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు ఎలా నడపాలి, మధ్యాహ్న భోజనం ఎలా నడపాలి, లాంటివన్నీ ఆపలేని పథకాలని, వీటన్నిటిని నడపాలంటే అప్పుల మీద ఆధారపడాల్సిన పరిస్థితి ఉందన్నారు. వీటితోపాటు హంద్రీనీవా కాలువ, జిబిసి కాలువ, విడపనకల్లు నుంచి గడేకల్లుకు, వి.కొత్తకోటకు, హావలిగి రోడ్డు, తాగునీటి ఏర్పాట్లు, ప్రజల ఆశలు, ఇబ్బందులు అన్నిటినీ సమతూకం చేసుకుంటూ ముందుకెళ్లడం అంటే కత్తి మీద సాములాంటిదే అన్నారు. మీరు పెట్టిన నమ్మకం వమ్ము కానీయకుండా రోజుకు మరిన్ని గంటలు అదనంగా కష్టపడతామని, తగ్గేది లేకుండా పని చేస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తామని, నియోజకవర్గంలో గతంలో లాగా అభివృద్ధిని ఎలా అయితే పరుగులు పెట్టించామో అలాగే నియోజకవర్గంలో అభివృద్ధిని శరవేగంగా ముందుకు తీసుకెళ్తామన్నారు. ఉరవకొండలో డిగ్రీ, జూనియర్ కాలేజీలు, హాస్పిటల్ ఏర్పాటు, జిబిసి కెనాల్ కు సిమెంట్ లైనింగ్, తాగునీటి పైప్ లైన్లు తమ హయాంలోనే ఏర్పాటు చేశామని, ఇంతకుముందు మనం చేసిన పనులు ఆగిపోతే మళ్ళీ ఇప్పుడు మొదలు పెట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. జిల్లాకు అదనంగా నీళ్లు వస్తే తప్ప మన జీవితాలు మారవని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో లేనటువంటి విధంగా 3,800 కోట్ల బడ్జెట్ కేటాయింపులు హంద్రీనీవా కాలువకు కేటాయించామని గర్వంగా చెబుతున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశీస్సులతోనే అది చేయగలిగామని, జిల్లాపై ఉన్న ప్రేమ, బాధ్యతతోనే చేశామన్నారు.
–. అభివృద్ధిలోను, సామాజిక అభివృద్ధిలోనూ రెండింటినీ సమతూకంగా ముందుకు తీసుకెళుతున్నామన్నారు. తనకు కష్టమైనా సరే నియోజకవర్గంలో మీ పనులు ఆగకూడదనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈరోజు పెద్ద ఎత్తున పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, ఇందులో ప్రజల అర్జీలను రాసేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశామని, ప్రతి అర్జీకి రసీదు ఇస్తారని, కంప్యూటర్లో ఎంట్రీ చేస్తారని, ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారన్నారు.
– ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మాలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ ఎస్ఆర్బిఐ శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, జిల్లా పరిషత్ సిఈఓ రామచంద్రారెడ్డి, డిఎల్డిఓ విజయలక్ష్మి, సర్పంచ్ చంద్రశేఖర్, సిపిఓ అశోక్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ, మండల అధికారులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 08:** విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులకు నారాయణ స్కూల్ నందు ప్రిన్సిపాల్ నందకుమార్ ఆధ్వర్యంలో కన్నుల పండుగగా ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ వేడుకలకు ముఖ్య అతిధిగా ఏ జి ఏం షేక్ అలీషాగారు హాజరు అయ్యారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తల్లిదండ్రుల హాజరై తమ పిల్లలు మెమేంటోస్, సర్టిఫికెట్స్ తీసుకోవడం చూసి ఎంతో మురిసిపోయారు. ఏ జి ఏం షేక్ అలీషా పిల్లలు చదువుల్లో రాణించడానికి అవసరమైన అనేక విషయాలు తెలియజేయగా, ప్రిన్సిపాల్ నందకుమార్ గారు విద్యార్థుల అభివృద్ధి కొరకు నారాయణ సంస్థ అనేక కార్యక్రమాలు చేస్తుందని తెలియజేసారు. తదనంతరం పిల్లల డాన్సలతో ఆవరణం దద్దరిల్లిపోయింది. ఈ కార్యక్రమానికి జోనల్ కో ఆర్డినేటర్ గోపి నాయుడు, సుశీల, హరిత, ఏవో ఆనంద్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, దివ్యశ్రీ, ఏడి చక్రవర్తి, ఉపాధ్యాయ సిబ్బంది మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ శ్రీ సోము వీర్రాజు విజయోత్సవ బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 08:** రాజమహేంద్రవరంలో కోటిపల్లి బస్టాండ్ నుండి మంజీరా ఫంక్షన్ హాల్ వరకు ఎమ్మెల్సీగా సోము వీర్రాజు ఎన్నికైన సందర్భంగా బీజేపీ ఎమ్మెల్సీ శ్రీ సోము వీర్రాజు విజయోత్సవ బైక్ ర్యాలీలో ఎమ్మెల్సీ శ్రీ సోము వీర్రాజు తో కలిసి పాల్గొన్న ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ కేంద్ర మంత్రివర్యులు శ్రీ భూపతిరాజు శ్రీనివాసవర్మ, అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, బిజెపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఉన్నారు.

## ఆధ్యాత్మిక పర్యటనలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 08:** ఆధ్యాత్మిక పర్యటనకు కర్ణాటక వెళ్ళిన మండపేట ఎమ్మెల్యే, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు మంగళవారం పలు ఆలయాలను సందర్శించి స్వామి అమ్మ వార్లను దర్శించుకున్నారు. ఉడిపి లో ఎమ్మెల్యే వేగుళ్ల కృష్ణుడి ఆలయాన్ని సందర్శించారు. శృంగేరి సరదా పీఠాన్ని దర్శించుకున్నారు. హొరనాడు లో అన్నపూర్ణేశ్వరి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, చర్ల రామన్న కాపు, తేతల గోవిందరెడ్డి, తాడి శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో పిజిఆర్ఎస్ అర్జీని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- : అర్జీదారుని భూమి విషయమై సమగ్రంగా జిల్లా కలెక్టర్ పరిశీలన
- : ఆత్మకూరు మండల కేంద్రం పరిధిలో పిజిఆర్ఎస్ అర్జీని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**అంకుశం న్యూస్ అనంతపురం, ఏప్రిల్ 08 :** అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలోక్షేత్రస్థాయిలో రెవెన్యూ సదస్సులలో ఇచ్చిన (పీజీఆర్ఎస్) అర్జీని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తనిఖీ చేశారు. మంగళవారం సాయంత్రం ఆత్మకూరు మండల కేంద్రం పరిధిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ల్ వచ్చిన అర్జీని జిల్లా కలెక్టర్ పరిశీలించి, అర్జీదారుల పిటిషన్ పై సమగ్రంగా పరిశీలన చేశారు.లి
– ఆత్మకూరు మండల కేంద్రం పరిధిలోని హరిజన లక్ష్మమ్మ %ఌ/శీ% పెద్దన్న అనే అర్జీదారురాలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) వేదికలో సర్వేనెంబర్ 547/7 లో ఉన్న ప్రభుత్వ భూమిలో 4.24 ఎకరాలను డిపట్టా కింద తమకు ఇచ్చారని, భూమిని ఆక్రమించి తలారి రామాంజనేయులు, ఓబన్న, కేశవ, హరీష్, జయకుమార్ తదితరులు సాగు చేసుకుంటున్నారని అర్జీని అందించారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సంబంధిత పొలంలో పర్యటన చేసి సమగ్రంగా వివరాలు ఆరా తీశారు. ఆర్ఐతో పిటిషన్ ని చదివించగా, రికార్డులను తనిఖీ చేశారా అని తహసిల్దార్ ని అడిగారు. ఒరిజినల్ సూట్ స్టేటస్ ని తనిఖీ చేయాలని, ఆర్డిఓకి నివేదిక అందించాలని తహసీల్దార్ ని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. 547/7 సర్వే నంబర్ లోని భూమిని సబ్ డివిజన్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తమ భర్త చనిపోవడంతో సదరు భూమిలో అర్జీదారులు 2016 నుంచి సాగు చేయడం లేదని, రెండు నెలలకు ముందు తమతో గొడవకు దిగి కులం పేరుతో దూషించారని, తమకు రక్షణ కల్పించాలని అర్జీదారులు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించి వీఆర్ఏ తలారి రామాంజనేయులుకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సదరు సమస్యపై రికార్డుల మేరకే న్యాయం చేయడం జరుగుతుందని, కోర్టు ఉత్తర్వుల మేరకు దౌర్జన్యాలకు పాల్పడరాదని, అలా దౌర్జన్యాలకు పాల్పడితే అలాంటి వారిపై కఠినంగా శిక్షించడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారులకు ఎలాంటి ఇబ్బందులు సృష్టించరాదని తలారి రామాంజనేయులు అన్నదమ్ములకు సూచించారు.
– ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మానాయక్, మండల సర్వేయర్ మధుర, వీఆర్వో మల్లికార్జున, ఆర్ఐ నాగభూషణం, అర్జీదారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభినందన సభలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 08:** రాజమహేంద్రవరంలో మంజీరా ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్సీగా సోము వీర్రాజు ఎన్నికైన సందర్భంగా బీజేపీ ఎమ్మెల్సీ శ్రీ సోము వీర్రాజు అభినందన సభలో పాల్గొన్ని, సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ కేంద్ర మంత్రివర్యులు శ్రీ భూపతిరాజు శ్రీనివాసవర్మ,రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీ కందుల దుర్గేష్, అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరి,ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు,బిజెపి నాయకులు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎమ్మెల్యే లు,బిజెపి మాజీ ఎమ్మెల్సీ లు, బిజెపి నాయకులు,కార్యకర్తలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.